అమ్మతనానికి ప్రాణాలే పణం!



మహిళలు అమ్మతనానికి ప్రాణాలనే పణంగా పెట్టాల్సి వస్తోంది. కుమురంభీం జిల్లాలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు చనిపోయారు. 10లో ▸



బస్సు రాక ఇక్కట్లు

చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు ఆర్టీసీ అధికారులు గతేడాది జనవరి 3న ఒకే రోజు బస్సు నడిపారు. ఆ తర్వాత నుంచి సర్వీసు నిలిపివేశారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం **30.2 / 11.6**

వాతావరణం

జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో శీతల గాలులు వీస్తాయి. ఉదయం పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సమర్థవంతంగా ఆడిట్ నిర్వహించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో బుధవారం నుంచి చేపడుతున్న ఆడిట్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆడిట్ ప్రక్రియ కోసం జిల్లాకు వచ్చిన మల్టీజోన్ –1 వరంగల్ నుంచి ఉప సంచాలకులు రాము జిల్లా ఆడిట్ అధికారి రాజేశంతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 15 మండలాల పరిధిలోని 335 పంచాయతీలు, మూడు ఆలయాలు, గ్రంథాలయాలు, జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో తగ్గని చలి

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాలను శీతల గాలులు వణికిస్తున్నాయి. తాజాగా సోమవారం తెల్లవారుజామున సిర్పూర్(యూ)లో 4.8 డిగ్రీలుగా కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కెరమెరిలో 6.2, తిర్యాణిలో 6.4, వాంకిడిలో 7.0, కాగజ్‌నగర్‌లో 8.6, రెబ్బెనలో 9.2, బెజ్జూర్, సిర్పూర్(టి) లో 9.4 డిగ్రీలుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులకు నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని అన్నారు. మిషన్ భగీరథ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 23న నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షులు పిడుగు శంకర్, కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశం సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన చార్జీలు మాత్రమే వసూలు చేయాలని ఆదేశించారు. కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, ఆర్ఐ గోపాల్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్(సిర్పూర్): త్వరలో పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. సోమవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం క్రీడాప్రాంగణాలను పరిశీలించారు. రంగనాయక దేవాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. తహసీల్దార్ శ్రీపాల్ తదితరులు ఉన్నారు.

అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా ఎంపికైన ఎంబీబీఎస్/బీఏఎంఎస్ వైద్యులు, బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం అభ్యర్థుల మెరిట్ లిస్టును జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్టు ప్రాతిపదికన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టు www.asifabad.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11న సాయంత్రం 5 గంటలలోగా తగిన ఆధారాలతో సంప్రదించాలని సూచించారు.

పండుగకు ప్రయాణమెట్లు..!

- సంక్రాంతి సెలవుల్లోనూ పాత రైళ్లే..
- గత పదేళ్లుగా కొత్త బండి రాక ఇక్కట్లు
- రూ.లక్షల ఆదాయం వస్తున్నా అరకొర సేవలే
- రైలు ప్రయాణికుల బాధలు పట్టించుకోని పాలకులు



మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఏటేటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా రద్దీకి అనుగుణంగా కొత్త రైళ్లు అందుబాటులోకి రావడం లేదు. పండుగ వేళలు, ప్రత్యేక రోజుల్లోనైనా ప్రత్యేక రైళ్లు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా 16 రైళ్లు నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రాంతం వారికి కనీసం ఒక ప్యాసింజర్ రైలు వేయకపోవడం అందరిలోనూ నిరాశ కలిగిస్తోంది. వార్షిక తనిఖీలు, ఈ ప్రాంతంలో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారుల పర్యటనల్లోనూ మరిన్ని రైళ్లు నడపాలని స్థానికులు చేస్తున్న వినతులు బుట్టదాఖలే అవుతున్నాయి. సంక్రాంతికి ఈ నెల 12నుంచి 17వరకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో సింగరేణి ప్రాంతంలోని కార్మిక కుటుంబాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి కోసం వలస వచ్చిన వాళ్లు రాకపోకలు సాగిస్తుంటారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలతోపాటు సికింద్రాబాద్, ఆంధ్రా ప్రాంతాలకు అధికంగా వెళ్తుంటారు. రద్దీ సమయాల్లో కనీసం సీట్లు దొరకక నిల్చుని ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. గడిచిన పదేళ్లలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ తర్వాత సిర్పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు మరో కొత్త రైలు అందుబాటులోకి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పెరిగిన రద్దీ.. తగ్గిన రైళ్లు

ఉదయం భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ తర్వాత సికింద్రాబాద్ వెళ్లేందుకు మధ్యాహ్నం ఇంటర్‌సిటీ మాత్రమే అందరికీ అందుబాటులో ఉంది. దాదాపు ఆరుగంటల వరకు మరో రైలు లేదు. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల రైల్వే వీక్లీ, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఒకటో రెండో అందుబాటులో ఉన్నాయి. వరంగల్ వైపు సింగరేణి(మెమూ) మాత్రమే అందరికీ అందుబాటులో ఉంది. సాయంత్రం కాగజ్‌నగర్ సూపర్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ వైపు ఉంది. సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల వైపు ఉదయం 5.20గంటలకు ఇంటర్‌సిటీ, 6.25 తెలంగాణ, 8.20 కాగజ్‌నగర్, 9.25కుదానాపూర్ రైళ్లు వెళ్లాక మధ్యాహ్నం 3.35గంటల వరకు మరో రైలు లేదు. ఆ తర్వాత కూడా రెగ్యులర్ నడిచే ఒక్క రైలూ లేదు. అన్నీ వీక్లీగా నడిచేవే. ఉదయం 8గంటలకు కాగజ్‌నగర్ నుంచి కాజీపేట వరకు మరో రైలు వస్తే ఎంతోమందికి లబ్ధి చేకూరనుంది. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఉపాధికి వెళ్లేవారికి ప్రయాణ సౌకర్యం మెరుగవుతుంది. బల్లార్షా నుంచి తిరుపతికి, గద్వాల–సిర్పూర్ కాగజ్‌నగర్, వయా కాచిగూడ, మెమూ ఎక్స్‌ప్రెస్, కాజీపేట–ఆదిలాబాద్ వయా మంచిర్యాల, బల్లార్షా, మాజీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, కాజీపేట జంక్షన్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మార్గంలో ఒక పుష్‌పుల్ రైళ్లను నడపాలని కోరుతున్నారు. కరోనా సమయంలో రద్దు చేసిన ఆనంద్‌వన్, తడోబా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మళ్లీ పునఃరుద్ధరణకు నోచుకోలేదు.

పట్టించుకోని పాలకులు

మంచిర్యాల, రవీంద్రఖని, మందమర్రి, రేచినీ రోడ్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ రోడ్, కాగజ్‌నగర్, సిర్పూర్–టి రైల్వేస్టేషన్ల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కాజీపేట, వరంగల్‌తో సికింద్రాబాద్ మధ్య ఎక్కువ మంది ప్రయాణం చేస్తున్నారు. ఒక్కో స్టేషన్ పరిధిలో రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. మంచిర్యాల రైల్వేస్టేషన్ పరిధిలో ఒక రోజు రూ.3లక్షలకుపైగా ప్రయాణికుల నుంచి ఆదాయం వస్తోంది. ఇక గూడ్స్ రవాణా అయితే రోజుకు రూ.3కోట్లపై మాటే. బల్లార్షా–కాజీపేట మధ్య 202కిలోమీటర్లు మూడో లైను పూర్తయింది. అయినప్పటికీ కొత్త రైళ్ల జాడ లేకపోవడంతో నిరాశపడుతున్నారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు గట్టిగా ప్రయత్నాలు చేయకపోవడం, రైల్వేశాఖను ఒప్పించలేకపోవడంతో రైలుమార్గం అందుబాటులో ఉండి కూడా ఆశించిన మేర సౌకర్యం పొందడం లేదు.

రద్దీకి అనుగుణంగా రైళ్లు లేవు



పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ఈ ప్రాంతం నుంచి రైళ్లు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో ఉన్న రైళ్లలోనే ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అవసరమైన మార్గాల్లో కొత్త రైళ్లు నడపాలి.

– ఉప్పులయ్య, కాంగ్రెస్ పార్టీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, మంచిర్యాల

ఇబ్బందులు పడాల్సి వస్తోంది



మేము ఇక్కడ సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మా సొంతూరు కొత్తగూడెంకు రాకపోకలు సాగిస్తుంటాం. సింగరేణి తప్ప వేరే ట్రైన్ లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంకో ట్రైన్ నడపాలని కోరుతున్నాం.

– మన్సూర్, కొత్తగూడెం

పాలకులు పట్టించుకోవాలి



ఈ ప్రాంతంపై రైల్వే శాఖ తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. రద్దీ వేళల్లో కూడా ప్రత్యేక రైళ్లు నడపడం లేదు. ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు, పాలకులు పట్టించుకోక కొత్త రైళ్లు రావడం లేదు. గత్యంతరం లేక ప్రయాణికులు రోడ్డు మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

– కామని శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, తాండూరు

పిల్లలకు నేను వంట చేసి పెట్టాలా..?

- అంగన్‌వాడీ టీచర్‌పై అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆగ్రహం



గుండాయిపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కౌటాల(సిర్పూర్): 'మధ్యాహ్నం ఒంటి గంటయినా పిల్లలకు ఎందుకు భోజనం పెట్టలేదని, నేను వచ్చి వంట చేసి పెట్టాలా..?' అని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గుండాయిపేట అంగన్‌వాడీ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కౌటాల మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఆయా అందుబాటులో లేకపోతే ఎందుకు వంట చేయలేదని, మీ ఇంట్లో వంట చేయడం లేదా అని అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. అనంతరం హెల్త్ సబ్‌సెంటర్ పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు మద్యం తాగి వచ్చి సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు తనకు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

గడువులోగా పూర్తిచేయాలి

కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో చేపటిన మన ఊరు– మన బడి పనులు గడువులోగా పూర్తిచేయాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. 1,120 కిలోల వర్మీ కంపోస్టును విక్రయించి రూ.33,650 ఆదాయం పొందినట్లు ఎంపీడీవో తెలిపారు. ఐకేపీ కార్యాలయంలో డ్రోన్ యంత్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో నస్రుల్లా ఖాన్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ విశ్వనాథ్, ఏపీఎం వెంకటరమణ, ఏపీవో పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో సత్తా చాటాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి

- శాస్త్ర సాంకేతికతతోనే సమాజం అభివృద్ధి
- తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- నిర్మల్‌లో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక మేళా ప్రారంభం
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు

నిర్మల్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి జాతీయస్థాయిలో సత్తా చాటాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కొండాపూర్ సెయింట్ థామస్ పాఠశాలలో సోమవారం డీఈవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక మేళా, ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనను దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు తమ మెదడుకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ ప్రదర్శన నుంచి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపిస్తామన్నారు. విద్యార్థులు మేధోశక్తిని చాటేలా ఉపాధ్యాయులు వారి వెన్నంటి ఉండి ప్రోత్సహించాలన్నారు. నేటి బాల శాస్త్రవేత్తలు రాబోయే సమాజానికి ఉపయోగపడాలని సూచించారు.

విజ్ఞానం ఎంతనేర్చినా తక్కువే

మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ విజ్ఞానం ఎంత నేర్చినా తక్కువేనన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ జిల్లాకు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సరస్వతీ అమ్మవారు కొలువుదీరిన జిల్లా విద్యారంగంలో ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాసర ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలను ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చొరవతో మరో రెండుమూడు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. రాబోయే రోజుల్లో 60 శాతం మంది ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ వస్తుందన్నారు. మన ఊరు –మన బడి కార్యక్రమం ద్వారా ప్రతి మండలంలోని రెండు పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నామన్నారు. రెండో విడతలో ట్రైబల్ పాఠశాలలకు కూడా నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవసేన మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్రతిరోజు సైన్స్ ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు నేర్పించే సైన్స్ పేదవాడికి కూడా ఉపయోగపడాలన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు విజ్ఞానంతో పాటు మానవత్వం కూడా నేర్పాలన్నారు. ప్రపంచంలో కెల్లా మన దేశమే విజ్ఞానానికి మూలమన్నారు. విద్యార్థుల్లో ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి , క్రియాశక్తి పెంపొందించాలన్నారు. కలెక్టర్ ముషరఫ్ అలీ మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్రతినిత్యం సైన్స్ ఒక భాగమైందన్నారు. సైన్స్‌తోనే జీవితం ముడిపడి ఉందని, వ్యవసాయం, పాఠశాల, మీడియా ఏ రంగంలో చూసినా సైన్స్‌దే కీలకపాత్ర అన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థుల ప్రదర్శనలను మంత్రులు, అధికారులు పరిశీలించారు. అంతకుముందు సెయింట్ థామస్ పాఠశాల, సోఫీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు చేసిన స్వాగత నృత్యాలు అలరించాయి. జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్, శాంతినికేతన్ ఉన్నత పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. ఇదిలా ఉండగా మధ్యాహ్న భోజనం ఆలస్యం కావడంతో కుభీర్ మండలం కిరుగుల్ బి పాఠశాలకు చెందిన విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. 108లో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి, అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, బాసర ట్రిపుల్‌ఐటీ వైస్‌చాన్స్‌లర్ వెంకటరమణ, వివిధ జిల్లాల డీఈవోలు పాల్గొన్నారు.



చిన్నారి ప్రతిభను మెచ్చుకుంటున్న మంత్రి

సమన్వయంతో అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణిలో వినతులు స్వీకరణ



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: ప్రజావాణిలో సమర్పించిన ప్రజల అర్జీలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితులు కలెక్టర్‌కు తమ గోడు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సమయంలో కంటి చూపు కోల్పోయానని, సదరం పింఛన్ మంజూరు చేయాలని సిర్పూర్(యూ) మండలం మహాగావ్ గ్రామానికి కడప శ్రీదేవి అర్జీ సమర్పించింది. కంటి శస్త్రచికిత్స అవసరమైన ఆర్థికసాయం అందించాలని వేడుకుంది. సింగరేణి గనుల విస్తరణలో భాగంగా 2010లో తిర్యాణి మండలం రాళ్లకన్నెపల్లి గ్రామంలో భూమి కోల్పోయామని, దివ్యాంగుడైన తనకు ఉద్యోగావకాశం కల్పించాలని కుర్సెంగ జాడిరావు దరఖాస్తు చేసుకున్నాడు. నిరుపేదనైన తాను పనిచేయకలేకపోతున్నానని, డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామానికి చెందిన దుర్గం శంకర్ అనే దివ్యాంగుడు కలెక్టర్‌కు విన్నవించాడు. సింగరేణి ప్రాజెక్టులతో నిర్వాసితులైన తమ కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆసిఫాబాద్ మండలం కొత్తగూడ గ్రామానికి చెందిన కుంరం కమల, కేస్లాపూర్‌కు చెందిన ఆత్రం బొరయ్య, తిర్యాణి మండలం సాలెగూడకు చెందిన కనక ఈశ్వరి, రాళ్లకన్నెపల్లికి చెందిన కుర్సెంగ శేఖమణి వేర్వేరుగా అర్జీ సమర్పించారు. ఆసరా పింఛన్ అందించి ఆదుకోవాలని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన 63 ఏళ్ల పెంపర్తి లక్ష్మణ్ కలెక్టర్‌కు విన్నవించాడు. 1993 ఎస్సీ కార్పొరేషన్ కింద రాణికుంట మంజూరైందని, ఈ కుంట కింద ఉన్న తమ భూముల్లో పెంచకుంటున్న చేపలను కొంత మంది దౌర్జన్యంగా పట్టుకుంటున్నారని తిర్యాణి మండలం గంభీరావుపేటకు చెందిన రైతులు ఆరోపించారు. అక్రమంగా చేపలు పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

- ఎంపీ సోయం బాపూరావు
- జంగుబాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ సోయం

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీలు తమ సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. కెరమెరి మండలం మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. మర్రిచెట్టు, రావుడ్‌దేవతలు, పోచమ్మ, మైసమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల తర్వాత తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన ఆలయ పెద్దలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి ఆలయానికి సంబంధించిన అటవీ హక్కుల పట్టాలపై చర్చిస్తామని, ఆలయ అభివృద్ధిపై మంత్రి కిషన్‌రెడ్డిని కలుస్తామని పేర్కొన్నారు. పీఎంజీఎస్‌వైలో రోడ్డు మంజూరైందని, కరోనా కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. రీటెండర్ వేసి పనులు మళ్లీ ప్రారంభిస్తామని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటే ఊరుకునేది లేదన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎంపీని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఇరు రాష్ట్రాల ఆలయ కమిటీ నాయకులు కొడప జాకు, మరప బాజీరావు, వెట్టి చందు, మరప సీతారాం, కటోడాలు మరప కోసు, సలాం నాగోరావు, వెట్టి జాకేరావు తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ల అక్రమాలతో ప్రజలకు అవస్థలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



టీచర్లకు మద్దతు తెలుపుతున్న ప్రవీణ్‌కుమార్

కౌటాల(సిర్పూర్): స్టోన్ క్రషర్ల అక్రమ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బహుజన రాజ్యాధికార యాత్ర సోమవారం సాయంత్రం కౌటాల మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్లతో రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వరదలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ప్రాణహిత ప్రాజెక్ట్ పూర్తిచేయడంతో పాటు ఏటా ఐదు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 317 జీవో బాధితులకు మద్దతు తెలిపారు. కౌటాల వార సంతలో యాత్ర నిర్వహించి స్థానికులతో మాట్లాడారు. అంతకు ముందు పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి, ముత్తంపేట గ్రామాల్లో యాత్ర కొనసాగింది. మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్, నాయకులు దుర్గం రాంప్రసాద్, నవీన్, శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేశ్‌బాబు

దహెగాం(సిర్పూర్): మండల స్థాయి అధికారులు పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. పంచా యతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై పంచా యతీ కార్యదర్శులు, సర్పంచులు, వివిధ శాఖ ల అధికారులకు మండల కేంద్రంలో సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు ఏ విధంగా తయారుచేయాలో వివరించారు. మండలంలోని అన్ని శాఖాల అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేయడం ద్వారా పంచాయతీల కు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ నెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతున్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని సూ చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, ఎంఈవో భిక్షపతి, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఏఈలు ఇనోస్, ఆత్మారాం, ఏవో వంశీకృష్ణ, వైద్య సిబ్బంది, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సోమవారం డీఎల్‌పీవో సురేశ్‌బాబు అధికారులు, సిబ్బందికి గ్రామాల్లో చేపట్టాల్సిన 16 అంశాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, ఎంపీవో గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించేందుకు కృషి

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రధానమంత్రి జీవిత బీమా పథకం లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నీతి ఆయోగ్ కార్యక్రమంపై జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిఒక్కరిని ప్రధాన మంత్రి జీవిత బీమా పథకం పరిధిలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జన్కాపూర్ శాఖ ద్వారా మంజూరైన రూ.2 లక్షల జీవిత బీమా చెక్కును జిల్లా కేంద్రానికి చెందిన లబ్ధిదారు ఎండీ తాహెర్‌కు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హన్మంత్‌రావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


అశోక్(ఫైల్)

జన్నారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా సిరికొండకు చెందిన పందెన అశోక్(35) తన స్నేహితులు ఓరుగంటి వెంకటేష్, పసి ప్రవీణ్‌లతో కలిసి ఆదివారం హైదరాబాద్ నుంచి సిరికొండకు కారులో వెళ్తున్నారు. మండలంలోని పైడిపల్లి గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి రాయిని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంకటేష్, ప్రవీణ్ స్వల్పంగా, అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అశోక్ రాత్రి మృతిచెందాడు. అశోక్‌కు భార్య గంగమణి, కూతురు సాహిత(5), కుమారుడు శివ(2) ఉన్నారు. అశోక్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడి అక్క కళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

దండేపల్లి: మండలంలోని గూడెంకు చెందిన చాతరాజి వెంకటి(57)ను బైక్ ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గూడెం చెక్‌పోస్టు సమీపంలో కన్నెపల్లికి చెందిన రాజమౌళి ఆదివారం సాయంత్రం బైక్‌ను అజాగ్రత్తగా నడుపుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న చాతరాజి వెంకటిని ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్సులో లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. రాత్రి సమయంలో చనిపోయాడు. మృతుడి సమీప బంధువు శంకర్ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మరొకరు డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట సమీపంలోని ప్లేవైర్ బ్రిడ్జి చివర బావిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి (50) మృతదేహం లభ్యమైంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై చంద్రకుమార్ మృతదేహానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, మూడు నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేత వరంగల్

- ద్వితీయ బహుమతి హైదరాబాద్
- ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు


వరంగల్ జట్టుకు షీల్డ్ అందిస్తున్న ప్రభుత్వ విప్ సుమన్

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో వరంగల్ జట్టు విజేతగా నిలిచింది. హైదరాబాద్ జట్టు ద్వితీయ, కరీంనగర్ జట్టు తృతీయ, నల్గొండ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. మూడు రోజులు జరుగుతున్న పోటీల్లో భాగంగా సోమవారం ఫైనల్ పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో వరంగల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బహుమతి ప్రదానం చేశారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, కోచ్ సత్యవాణి, ఆర్గనైజర్లు కాంపెల్లి సమ్మయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, సకినాల శంకర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడను ప్రోత్సహించాలి

అంతర్జాతీయ క్రీడగా గుర్తింపు పొందిన హ్యాండ్‌బాల్‌ను ప్రోత్సహించాలని క్రీడాకారులు, అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు. తెలంగాణలో సరైన నిధులు అందక ఆదరణ కరువైందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పలువురు అభిప్రాయాలు వారి మాటల్లోనే..

రిజర్వేషన్ కల్పించాలి



రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడాకారులు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఆడిన వారు ఉన్నారు. ఉద్యోగం, ఉన్నత చదువుల్లో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను గుర్తించి నగదు ప్రోత్సాహకం అందజేస్తే మరికొందరు క్రీడాకారులు ముందుకు వస్తారు.

– కనపర్తి రమేశ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నేను సిద్దిపేటలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాను. హ్యాండ్‌బాల్ క్రీడపై ప్రత్యేక దృష్టి సారించి చక్కని మెలకువలు నేర్చుకుని గత సంవత్సరం బహ్రెయిన్ దేశంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. ప్రభుత్వం గుర్తించి రిజర్వేషన్ కల్పించి ఉద్యోగావకాశం ఇచ్చి ప్రోత్సహిస్తే బాగుంటుంది.

–సీహెచ్.సుభాష్‌చంద్ర, అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు

సౌకర్యాలు కల్పించాలి



సుమారు 20ఏళ్ల నుంచి హ్యాండ్‌బాల్ గేమ్‌కు కోచ్‌గా వ్యవహరిస్తున్నాను. ఎక్కువ శాతం మంది క్రీడాకారులు గ్రామీణ ప్రాంతం నుంచి వస్తారు. వారికి కనీస సౌకర్యాలైన డైట్ మెయింటనెన్స్, హాస్టల్, అకాడమీ వంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్రీడా మైదానాలను క్రీడా కర్మాగారాలుగా తయారు చేసినప్పుడే క్రీడాకారుడు ఫిజికల్‌గా ఎదుగుతాడు.

– టీవీఎల్ సత్యవాణి, హ్యాండ్ బాల్ గేమ్ కోచ్

ఒలింపిక్స్‌లో ఆడాలనే ఆశ..



నేను మంచిర్యాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. రెండు సార్లు హ్యాండ్ బాల్ గేమ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయి. ఒలింపిక్స్ గేమ్‌లో ఎంపికై సత్తా చూపించాలనే ఆశతో ఉన్నాను. తలిదండ్రులు, కోచ్ ప్రోత్సాహం బాగుంది. – బి.సంతోష్, హ్యాండ్‌బాల్ జాతీయ క్రీడాకారుడు

నిధులు మంజూరు చేయాలి



హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్రంలో సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో కంట్రీబ్యూషన్ ద్వారా పోటీలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. నిధులు కేటాయించి క్రీడాకారులకు ఆటవస్తువులు సరఫరా చేస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ చూపి హ్యాండ్‌బాల్ క్రీడకు నిధులు కేటాయించాలి.

– శ్యామల పవన్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి


హ్యాండ్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఆర్మీలో ఉద్యోగం రాదని ఆత్మహత్య


మృతుడు రఘు(ఫైల్)

నెన్నెల: పోలీసు ఉద్యోగం సాధించాలని కలలు కన్నాడు. మూడుసార్లు ఆర్మీ పోలీసు ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. రెండుసార్లు ఈవెంట్స్‌లో, మూడోసారి రాతపరీక్షలో ఫెయిల్ అయ్యాడు. ఇక ఉద్యోగం రాదేమోనని ఉరేసుకున్నాడు. ఈ సంఘటన నెన్నెల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నెన్నెల గ్రామానికి చెందిన పుప్పాల రఘు(28) ఐటీఐ, ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే రెండుసార్లు ఈవెంట్స్‌లో ఫెయిలయ్యాడు. మూడోసారి ప్రయత్నంలో రాత పరీక్షలోనూ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. ఉదయం నెన్నెలలోని హాస్టల్ వెనుకాల చెట్టుకు రఘు మృతదేహం వేలాడుతూ కనిపించింది. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల

కడెం: కడెం ఆయకట్టు యాసంగి పంటలకుగాను మంగళవారం ఉదయం 10 గంటలకు ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్‌రావులు నీటిని విడుదల చేయనున్నట్లు ఈఈ రాజశేఖర్ ప్రకటనలో పేర్కొన్నారు. వారబందీ పద్ధతిన ఐదు తడుల నీటిని ఇవ్వనున్నారని తెలిపారు.

కలప పట్టివేత

బోథ్: మండల కేంద్రంలోని మైసమ్మకాలనీలో ఫారెస్ట్ అధికారులు కలప దుంగలను సోమవారం పట్టుకున్నారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుందర్ తెలిపిన వివరాలు.. ముందస్తు సమాచారంతో మైసమ్మకాలనీలో మాటు వేసి ఉన్నారు. అక్కడికి వచ్చిన టాటాఏస్ వాహనాన్ని తనిఖీ చేయగా టేకు దుంగలు లభ్యమయ్యాయి. వీటి విలువ రూ.33,916 ఉంటుందని తెలిపారు. పట్టుకున్న దుంగలను ఫారెస్ట్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

గిరిజన అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజనుల అందించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి 72 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏడీఎహెచ్‌వో బాలు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

- ఉపాధి పథకం సంబంధించిన జాబ్‌కార్డు ఇప్పించాలని ఉట్నూర్ మండలం దేవానగర్‌కు చెందిన రామిడి లక్ష్మి అర్జీ పెట్టుకుంది.
- తనకు వంశపారపర్యంగా సంక్రమించిన విరాసత్ భూమికి పట్టా మంజూరు చేయాలని బేల మండలం దౌనకు చెందిన లేతుబాయి విన్నవించింది.
- పంట సాగుకు విద్యుత్ మోటారుతోపాటు బోరు బావి మంజూరు చేయాలని బజార్‌హత్నూర్ మండలం భూతాయికి చెందిన రాథోడ్ రాహుల్ విన్నవించాడు.
- కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణం అందించాలని ఇంద్రవెల్లి మండలం వాల్‌గోండకు చెందిన జాలంసింగ్ వేడుకున్నాడు.
- తాము సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కు పత్రాలివ్వాలని జైనూర్ మండలం పోచంలొద్దికి చెందిన మాన్కు అర్జీ పెట్టుకున్నాడు.

పోలీస్ పేరిట దారిదోపిడీ

- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారే


వివరాలు వెల్లడిస్తున్న భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారే

భైంసారూరల్: పోలీస్ పేరిట దారిదోపిడీకి పాల్పడ్డ నిందితుడు మహ్మద్ జహీర్‌ను అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారే తెలిపారు. సోమవారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత రెండు నెలల క్రితం బైక్‌పై వెళ్తున్న ఓ వాహనదారుడిని ఆపి వాహనపత్రాలు చూపించాలంటూ మాటల్లో పెట్టి అతని వద్ద నుంచి రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన ఘటన తిమ్మాపూర్ సమీపంలో జరిగిన సంఘటన విదితమే. కోతుల్‌గాం గ్రామానికి చెందిన బాధితుడు భూమన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించారు. నిర్మల్‌కు చెందిన మహ్మద్ జహీర్‌గా గుర్తించారు. స్పెషల్ టీం వెతుకుతుండగా నిర్మల్‌లో అరెస్టుచేసి అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహ్మద్ జహీర్‌పై నిర్మల్‌లో నాలుగు కేసులు ఉన్నాయని వెల్లడించారు. స్పెషల్‌టీంలో హెడ్‌కానిస్టేబుల్ నరహరి, హోంగార్డు శంకర్‌కు ఏఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులపై ఆందోళన


ఆందోళన చేస్తున్న వినియోగదారులు

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామంలో ఇళ్లకు అధికంగా విద్యుత్ బిల్లులు రావడంపై వినియోగదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లకు రూ.250 నుంచి 300 వచ్చిన వారికి ఏ.సీ.డీ పేరిట వేల రూపాయలు అదనంగా రావడం ఏంటని ప్రశ్నించారు. గతంలో 300 విద్యుత్ యూనిట్ల కంటే ఎక్కువ వినియోగించిన వారికే ఏ.సీ.డీ పేరిట వసూలు చేసేవారని అన్నారు. నేడు 60–150 యూనిట్లు వినియోగిస్తే ఏ.సీ.డీ పేరిట (డెవలప్‌మెంట్ చార్జీల కింద) బిల్లులు వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఏ.సీ.డీ పేరిట వేసిన బిల్లులను వెనక్కి తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు గంగన్న, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఏడుగురి అరెస్టు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని వేణునగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై భరత్‌సుమన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వేణునగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఏడుగురు వ్యక్తులు కొన్ని పాలిథీన్ కవర్లు కలిగి ఉండటంతో పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. వారిని వెంబడించి పట్టుకున్నారు. కవర్లను పరిశీలించగా గంజాయిని లభ్యమైంది. పుల్‌చంద్, రామేశ్వర్, నాంపెల్లి జ్యోతి, ప్రీతమ్‌కుమార్, కోలా, టేకం రమేశ్, జ్యోతిరామ్‌ను అదుపులో తీసుకుని విచారించారు. గాదిగూడ మండలం కోమలకు చెందిన రైతు తన పొలంలో గతేడాది నుంచి అంతర పంటగా గంజాయి మొక్కలు సాగు చేసినట్లు వెల్లడించారు. రైతు ఇతర ప్రాంతాలకు గంజాయి విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలని ఇక్కడి వారికి గంజాయిని విక్రయించారు. వేణునగర్‌లో పట్టుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయితోపాటు రూ.2 వేలు, 5 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులను పట్టుకున్న ఎస్సైతోపాటు సిబ్బంది దాదారావు, నాగన్న, కొండిబారావు, లక్ష్మీనారాయణను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

పంటల సాగులో చలిగాలుల ప్రభావం



బెల్లంపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పలు రకాల పంటలకు ప్రతికూలంగా మారుతోంది. గడిచిన కొన్నిరోజుల నుంచి రోజువారీగా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. రానురాను పగటి ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోనున్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాల్సి ఉంటుందని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త ఎం.రాజేశ్వర్‌నాయక్ తెలిపారు. యాజమాన్య పద్ధతులు, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఏ పంటలకు అనుకూలంగా మారుతుందో 'సాక్షి'కి తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..



- మొక్కజొన్న, వేరుశనగ, శనగలో తెగులు
- నివారణకు చర్యలు తీసుకోవాలి
- రబీ సీజన్‌లో నారుమడికి అనుకూలం

నారుమడికి అనుకూలం..

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రబీలో వరినారుమడి పోసుకోవడానికి పూర్తిగా అనుకూలం. ఎకరాకు సరిపడే నారుమడి తయారు చేసుకోవడానికి ఆఖరి దుక్కిలో 500 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను వేసుకోవాలి. బాగా మాగిన పశువుల ఎరువు 400 కిలోలు లేదా కోళ్ల ఎరువు 200 కిలోలు ఎకరాకు సరిపోవు నారుమడిలో వేసుకోవాలి. తద్వారా నారు చలిని తట్టుకోవడమే కాకుండా సూక్ష్మపోషకాలు అయిన జింక్, ఐరన్ బాగా లభ్యమవుతాయి. నారుమడితో రాత్రివేళలో నీళ్లు నిండుగా ఉంచి తెల్లవారుజాము తీసివేసి కొత్తనీరు పెట్టాలి. ఒక అడుగు ఎత్తులో వెదురు కర్రలు అమర్చి దానిమీద పాలిథిన్ షీట్ కాని టార్పోలిన్ కాని సాయంత్రం వేళలో కప్పి ఉదయం తీసివేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరినారుమళ్లలో అగ్గితెగులు ఆశిస్తాయి. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలిన్ 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వరినారులో జింక్ ధాతులోప లక్షణాలు గమనించినట్లెతై 2 గ్రాములు జింక్ సల్ఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న పంట: మొక్కజొన్న పంటలో భాస్వరం లోప లక్షణాల వల్ల ఆకులు ఊదారంగులోకి మారుతాయి. నివారణకు 10 గ్రాములు 19:19:19 లేదా డీఏపీని లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల మొక్క జొన్నలో కత్తెరపురుగు ప్రభావం ఉంటుంది. నివారణ కోసం 0.3 మి.లీ క్లోరాంతనిప్రోల్ లేదా 0.5 మి.లీ స్పైనటోరం మందును లీటరు నీటిలో కలిపి సుడిలో పడే విధంగా పిచికారి చేయాలి.

శనగ పంటలు: చలిగాలుల ప్రభావం వల్ల శనగ పంటలో పచ్చ పురుగు సోకడానికి అవకాశాలు అధికంగా ఉంటాయి. పంటలో పురుగు ఉధృతిని గమనించినట్లయితే నివారణ చర్యలు తీసుకోవాలి. 1.5 గ్రాముల ఎఫిసెట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. జొన్నపంటకు పెనుబంక పురుగు ఆశించే అవకాశాలున్నాయి. ఆ పురుగును పంటల గమనించిన వెంటనే 2 మి.లీ మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయెట్ లీటరుట నీటిలో కలిపి పిచికారి చేయాలి. అదేతీరుగా మిరపలో తామర పురుగు ప్రభావం ఉండే అవకాశాలు అధికంగా ఉంటాయి. పురుగు ఆశించిన ఆనవాళ్లు గమనించినట్లెతై నివారణకు 1.5 గ్రాముల ఎఫిసెట్ లేదా ఫిప్రొనిల్ 2.మి.లీ లేదా డైమైతోయెట్ 2.మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి వల్ల పంటకు శ్రేయస్కరంగా ఉంటుంది.

వేరుశనగ పంటలు: చలి తీవ్రతతో వేరుశనగలో పొగాకు లద్దె పురుగు అధికంగా సోకుతాయి. లద్దె పురుగు సూక్ష్మంగా ఉన్నప్పుడు 0.5 శాతం వేప కషాయం లేదా 5 మి.లీ వేపనూనె (అజాడిరెటక్టిన్) లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాను నివారించడానికి 200 మి.లీ నోవల్యురాన్ లేదా 40 మి.లీ ఫ్లూబెండియామైడ్ ఎకరాకు సరిపోయేలా 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుత వాతావరణ ప్రభావం వల్ల వేరుశనగలో తిక్క ఆకుమచ్చ తెగులు సోకడానికి అనుకూల పరిస్థితులు అధికంగా ఉంటాయి. నివారణ కోసం 2 గ్రాము క్లోరో థాలోనిల్ లేదా 1 గ్రాము టిబ్యుకొనుజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వేరుశనగలో మొదళ్ల కుళ్లు తెగులు ఆశించే అవకాశాలు ఉంటాయి. నివారణకు 2 గ్రాముల కార్బండిజమ్, మ్యాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లను తడపాలి.

ఆస్పత్రిలో కాయకల్ప బృందం పరిశీలన


వార్డులను పరిశీలిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని కాయకల్ప అవార్డుకు సంబంధించిన ప్రత్యేక బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ప్రతీ వార్డు, ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించారు. పెద్ద సంఖ్యలో రోగులు రావడం, ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉండడం గమనించారు. ఆసుపత్రిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆసుపత్రి ఆర్‌ఎంవో శ్రీమన్నారాయణ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ క్వాలిటీ అధికారి శివకుమార్, రాము, సుచరిత, సంతేశ్వర్ ఉన్నారు.

రెండు చోట్ల చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని టీచర్స్‌కాలనీలో గర్రెపెల్లి కిషన్‌కు చెందిన బైక్ సోమవారం చోరీకి గురైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. అదేకాలనీకి చెందిన మర్రి రాధ ఈనెల 6న ఇంటికి తాళం వేసి మహారాష్ట్రకు వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి చేరుకున్నారు. తలుపు తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో వెళ్లి చూడగా వెండి, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు ఎస్సై వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో పర్యటన


ఓసీపీ ప్రాంతాన్ని సందర్శిస్తున్న శాస్త్రవేత్తలు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ప్రతిపాదిత గోలేటి ఓసీపీ ప్రాంతంలో సోమవారం ఎన్ఐటీ శాస్త్రవేత్తలు పర్యటించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కర్నాటక అసోషియేట్ ప్రొఫెసర్ రామచందర్, ఎన్ఐటీ వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ రమణలు ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి సైంటిఫిక్ స్టడీలో భాగంగా ఏరియాలో పర్యటన చేశారు. నూతనంగా చేపట్టబోయే గోలేటి ఓసీపీ ప్రదేశాలతో పాటు సమీపాన ఉన్న గుట్టలను పరిశీలించారు. అనంతరం ఖైరిగూడ ఓసీపీని సందర్శించి ఓసీపీలో ఏర్పాటు చేసిన రక్షణ కట్టలను పరిశీలించారు. కట్టలను మరింత రక్షణాత్మకంగా నిర్మించేందుకు అవసరమైన సూచనలు, సలహాలను అందజేశారు. జీఎం ఎక్స్‌ప్లోరేషన్ శ్రీనివాసరావు, ఏజీఎం ఎక్స్‌ప్లోరేషన్ శివ నారాయణ, ఎస్‌వోటూజీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, మేనేజర్లు ప్రవీణ్ ఫాటింగ్, మహేశ్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు


పూజలు చేస్తున్న ఎంపీ సోయం బాపురావు

నార్నూర్: ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎంపీ సోయం బాపురావు అన్నారు. మండల కేంద్రంలోని తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖందేవ్ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించారు. తొడసం వంశస్తుల పెద్దలతో మాట్లాడి ఆలయ అభివృద్ధితోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ఆదివాసీ గిరిజనులు పాటిస్తున్నారని అన్నారు. ఖందేవ్ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఆయనవెంట ఐటీడీఏ పాలక మండలి డైరెక్టర్ మాడవి మాన్కు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక ప్రభాకర్, కార్యదర్శి మెస్రం మానిక్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు తొడసం బండు, అన్నాభావు సాఠె కమిటీ మండల అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్ తదితరులు ఉన్నారు.